www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 7 జనవరి 2025

5

కాకినాడ

యుటిఎఫ్ ప్రదర్శనకు ఘన స్వాగతం

ప్రజాశక్తి - కాకినాడ

స్వాగతం పలుకుతున్న ప్రజా సంఘాల నాయకులు

యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభల సందర్భంగా సోమవారం నగరంలో జరిగిన మహా ప్రదర్శనకు కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీల నాయకత్వం ఘనంగా స్వాగతం పలికింది. స్థానిక జిజిహెచ్ కూడలి వద్ద ప్రదర్శనగా వస్తున్న యుటిఎఫ్ నాయకత్వానికి పూలు జల్లి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కూరాకుల సింహాచలం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి.ఈశ్వరరావు, కెవిపిఎస్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

చైతన్యాన్ని నింపిన సదస్సులు

- ఆకట్టుకున్న ప్రముఖుల ప్రసంగాలు
- కాకినాడలో భారీ ప్రదర్శన
- ఉత్సాంగా పాల్గొన్న ఉపాధ్యాయులు
- 2వ రోజుకు స్వర్ణోత్సవ మహాసభ

యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలో భాగంగా సోమవారం నిర్వహించిన విద్యాసదస్సు, సాహిత్య సదస్సు, మహిళా సదస్సు చైతన్యాన్ని నింపాయి. ప్రముఖుల ప్రసంగాలు ఆలోచింపజేశాయి. విద్యా వ్యవస్థలో వస్తున్న పోకడలు, సాహిత్యం ఆవశ్యకత, మహిళలపై కొనసాగుతున్న వివక్ష వంటి వాటిపై సదస్సుల్లో వ్యక్తలు ప్రస్తావించారు. వారి ప్రసంగాలను ఆసక్తిగా విన్నారు. సాయంత్రం కాకినాడ నగరంలో నిర్వహించిన భారీ ర్యాలీతో స్మార్ట్ సిటీ ఎరుపు రంగును పులుముకుంది.

:: ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి, పిఠాపురం ::

హాజరైన ప్రతినిదులు

ఆర్ఎస్ఎస్ నియంత్రణలో ఎన్ఇపి

కేరళ విద్యా శాఖ మాజీ మంత్రి బేబి

కేంద్రంలోని మోడీ సర్కార్ తీసుకొచ్చిన నూత విద్యా విధానం ఆర్ఎస్ఎస్ నియంత్రణలో, బిజెపి ఆధిపత్యంతో ఉందని కేరళ విద్యా శాఖ మాజీ మంత్రి ఎం.ఎ.బేబి అన్నారు. యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా సోమవారం విద్యా సదస్సు యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.సురేష్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో బేబి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విద్యా రంగాన్ని చిన్నాభిన్నం చేస్తుందన్నారు. ఎన్ఇపికి ప్రత్యామ్నాయంగా కేరళ ప్రజాస్వామిక విద్యా విధానం అమలవుతుందన్నారు. 1956లో కేరళలో నంబూద్రిపాద్ నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం ప్రజాస్వామ్య విద్యా విధానంతో బిల్లును తీసుకొచ్చిందన్నారు. 1957లో విద్యా రంగంతో సంబంధం ఉన్న భూ సంస్కరణలు తీసుకొచ్చిందని తెలిపారు. భూమి లేని వ్యవసాయ కార్మికులు, రైతులకు భూములు ఇవ్వడంతో, వారి ఆర్థిక సామర్థ్యం పెరిగి, తమ పిల్లలను చదువించుకోగలమనే నమ్మకం వచ్చిందని తెలిపారు. ఇవన్నీ ప్రజాస్వామ్య విద్యా విధానం ఉద్భవించడానికి ఉపయోగపడ్డాయని అన్నారు. ఇంగ్లీష్ మీడియం విద్యా చాలా గొప్పదనే భావన పోవాలన్నారు. ప్రపంచంలో చాలా మంది ప్రముఖులు తమ మాతృ భాషలోనే విద్యాభ్యాసం చేశారని గుర్తు చేశారు.

యుటిఎఫ్ సీనియర్ నాయకులు విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రాథమిక విద్యపై పూర్తిస్థాయిలో దష్టిని పెట్టి ప్రణాళికలు రచించి అందుకు తగ్గట్టుగా కేటాయింపులు చేయాలన్నారు. ఒక దార్శనికత, ఒక స్పష్టత లేని విద్యా విధానం ఇక్కడ కొనసాగుతుందని విమర్శించారు. నేటి పాలకులు విద్యారంగానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. జయతి ఘోష్ కమిటీ గురించి ప్రస్తావిచారు. ఆంధ్రప్రదేశ్‌కు సొంతంగా ఒక విద్యా విధానం, అకాడమిక్ విధానం, పరీక్ష విధానం ఉండాలన్నారు. పాఠశాల విద్యలో మనం 11వ స్థానంలో వెనకబడి ఉన్నామని గుర్తు చేశారు. ఎస్‌టిఎఫ్ఐ జాతీయ కార్యదర్శి సిఎన్.భారతి మాట్లాడుతూ దేశంలో విద్య పూర్తిగా వ్యాపారం అయిపోయిందన్నారు. ఉపాధ్యాయుల హక్కులు ఆయా ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. ప్రభుత్వాలు సిపిఎస్ ను వెంటనే రద్దుచేసి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. ఉపాధ్యాయుడు సామాజికంగానూ, ఆర్థికంగానూ ఉన్నతంగా ఉన్నప్పుడే మంచి బోధన చేయగలడన్నారు. ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివారెడ్డి, విద్యాసాగర్ మాట్లాడుతూ ఇలాంటి సదస్సులు వల్ల చైతన్యం పెరుగుతుందన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాల వల్ల రాష్ట్రంలో అనేక పాఠశాలలు ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయన్నారు. జిఒ 117ను రద్దు చేయాలన్నారు. 3, 4, 5 ప్రాథమిక పాఠశాలల్లోనే ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పిడిఎఫ్ ఎంఎల్‌సిలు కెఎస్.లక్ష్మణరావు, ఇళ్ల వెంకటేశ్వరరావు, బొర్రా గోపిమూర్తి, యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శులు రెడ్డి మోహన్రావు, కిషోర్, మనోహర్, లక్ష్మీ రాజ్యం, జ్యోతి బసు, అన్నారాం, కుమార్ రాజా, తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి లక్ష్మణరావు

పాఠ్యపుస్తకాలకు మతం రంగు తగదు

సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు మోహన్

తరగతి గదుల్లో బోధించే పాఠ్యపుస్తకాలకు మతం రంగు పులమడం సరికాదని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కె.మోహన్ అన్నారు. ఐక్యోపాధ్యాయ ప్రధాన సంపాదకులు ఎన్.కుమారరాజా అధ్యక్షతన జరిగిన సాహిత్య సదస్సులో ఆయన మాట్లాడారు. సామ్రాజ్యవాద విష కౌగిట్లో దేశం ఉందన్నారు. దాని నుంచి బయట పడేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. లౌకిక తత్వాన్ని కాపాడాలన్నారు. శాస్త్రీయమైన విద్యను అందించేందుకు కృషి చేయాలన్నారు. తరగతి గదిలో ప్రశ్నించే తత్వాన్ని పెంచడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. కలంతో యుద్ధం చేస్తే తప్ప ఈ అసమానతలు, విష సంస్కతిపై విజయం సాధించలేమన్నారు.

కుమార రాజా మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజాభివృద్ధికి సాహిత్యం అవసరమన్నారు. సాహిత్యానికి చరిత్రలో ఎనలేని ప్రాముఖ్యత ఉందన్నారు. 1905 బెంగాల్ విభజనలో విద్యార్థులను ఐకమత్యం చేసే దానికి సాహిత్యం బాగా ఉపయోగపడిందన్నారు. వేమన పద్యాలు సమాజంలో ఐక్యతా విలువలను, ఆధునిక భావనలు పెంచడంలో కీలక భూమిక పోషిస్తున్నాయన్నారు. శ్రీశ్రీ, గురజాడ వంటి కవుల రచనలు స్ఫూర్తిదాయకమన్నారు. రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ సాహిత్యం మరో నవ సమాజాన్ని నిర్మించడానికి తోడ్పడుతుందన్నారు. ఈ సదస్సులో అట్టాడ అప్పలనాయుడు రచించిన నక్షత్ర బాట పుస్తకాన్ని, కె.మోహన్ రచించిన 'చెమట చెక్కిన వాక్యం' పుస్తకాలను ఎంఎల్‌సి కెఎస్.లక్ష్మణరావు ఆవిష్కరించారు. రాష్ట్ర కార్యదర్శి నవ కోటేశ్వరరావు వందన సమర్పణ చేశారు

ఆగని మహిళలపై దాడులు

ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి ధావళే

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు అయినా నేటికీ మహిళలపై లైంగిక వేధింపులు, దాడులు జరుగుతూనే ఉన్నాయని ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావళే ఆవేదన వ్యక్తం చేశారు.

ఎరుపెక్కిన కాకినాడ

నగర వీధుల్లో భారీ ప్రదర్శన

యుటిఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా సోమవారం కాకినాడ నగరంలో భారీ ప్రదర్శన జరిగింది. పది కిలోమీటర్ల మేర యుటిఎఫ్ జెండాలు పట్టుకుని ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రదర్శన ముందు భాగాన కొమ్ము డ్యాన్సులు, తప్పెటగుళ్ల ప్రదర్శన ఆకట్టుకుంది. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్. వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ నేతృత్వంలో ఈ ప్రదర్శన జరిగింది. పిడిఎఫ్ ఎంఎల్‌సిలు, పలువురు ప్రముఖులు ప్రదర్శన అగ్రభాగాన నడిచారు.

ఎస్‌టిఎఫ్ఐ జాతీయ కార్యదర్శి ఎన్.అరుణకుమారి అధ్యక్షతన జరిగిన మహిళా సదస్సులో ఆమె మాట్లాడారు. రాజ్యాంగం ద్వారా వచ్చిన సమాన అవకాశాలు నేటికీ మహిళలకు అందని ద్రాక్షగానే ఉన్నాయన్నారు. అన్ని రంగాల్లోనూ వివక్షను ఎదుర్కొంటున్నారన్నారు. వీటిపై ఐక్యంగా పోరాడాలన్నారు. సిఎం చంద్రబాబు కేంద్రానికి మద్దతు ఉపసంహరించుకునేలా ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేయాలన్నారు. కేంద్రం నూతన పెన్షన్ విధానాన్ని తీసుకొచ్చిందన్నారు. చంద్రబాబు మద్దతు ఉపసంహరించుకొని దీనిపై మాట్లాడాలన్నారు. చంద్రబాబు, నితీష్‌కుమార్ కేంద్రానికి మద్దతు ఇవ్వడం సిగ్గు చేటు అన్నారు. ఎన్నికల కమిషన్ మోడీ, అమిత్ షా ఆడిందే ఆట,పాడిందే పాటలా పనిచేస్తుందన్నారు. అరుణకుమారి మాట్లాడుతూ విద్యతోనే వివక్షను రూపుమాపొచ్చన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సి.కమలకుమారి, రాష్ట్ర మహిళా కార్యదర్శి విజయగౌరి మాట్లాడుతూ నేటికీ వేతన వ్యత్యాసాలు కొనసాగుతూనే ఉండటం ఆందోళనకరమన్నారు. ప్రముఖ సామాజిక కార్యకర్త వసుంధర మాట్లాడుతూ మధ్య యుగం కాలంలో దేశంలో మహిళలపై వివక్షత ప్రారంభమై, నేటికీ కొనసాగుతూనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు విజయగౌరి, నాగమణి , దేవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంగన్‌వాడీ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - కాకినాడ

ఆవిర్భావ దినోత్సవంలో మాట్లాడుతున్న బేబిరాణి

స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద సోమవారం ఆలిండియా అంగన్‌వాడీ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబిరాణి ఐఫా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనవరి 6న ఆలిండియా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఫెడరేషన్ ఆవిర్భవించిందన్నారు. హక్కులు కోసం అనేక పోరాటాలు, ఉద్యమాలు చేసి ఎన్నో విజయాలు సాధించుకున్నామన్నారు. అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, కనిస వేతనం ఇవ్వాలని, మట్టి ఖర్చుల జిఒ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలు ఇకమీదట కూడా ఐక్య ఉద్యమాలు చేపట్టాలని, 2011లో కేంద్ర ప్రభుత్వం వేతనాలను పెంచిందని తెలిపారు. అయితే నాటి నుంచి నేటి వరకూ నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగినా అంగన్‌వాడీలకు మాత్రం జీతాలను పెంచలే దన్నారు. త్వరలోనే సమస్యల పరిష్కారం కోసం జాతీయ స్థాయిలో ఉద్యమానికి శ్రీకారం చుట్టనున్నామని, అందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.చంద్రావతి, కుమారి, సిఐటియు నాయకురాలు షేక్ పద్మ, తదితరులు పాల్గొన్నారు.

అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారం చూపాలి

జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాకినాడలో కలెక్టర్ షాన్‌మోహన్, ఇతర డివిజన్, మండల స్థాయిల్లో ఆర్‌డిఒలు, తహశీల్దార్లు అర్జీలను స్వీకరించారు.

ప్రజాశక్తి - యంత్రాంగం

కాకినాడ పిజిఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు సంతృప్తికరమైన రీతిలో పరిష్కారం చూపాలని కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యాక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, డిఆర్ఒ జె.వెంకటరావు, జడ్‌పి సిఇఒ వివివిఎస్.లక్ష్మణరావు, హౌసింగ్ పీడీ ఎన్‌వివి.సత్యనారాయణ, కెఎస్ఇజెడ్ ఎస్‌డిసి కెవి.రామలక్ష్మి, సిపిఒ పి.త్రినాథ్‌లతో కలిసి ఆయన ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ వాటిపై సత్వరం సమగ్రమైన, సంతృప్తికరమైన పరిష్కారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా రెవెన్యూ, పింఛన్లు, రేషన్ కార్డు మంజూరు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, టిడ్కో గృహాలు, ఇళ్ల స్థలాలు, భూమి వివరాలు ఆన్‌లైన్లో నమోదు, ఆక్రమణలు తొలిగింపు, డ్రెయిన్లు, కాలువల్లో పూడిక తొలగింపు, పారిశుధ్యం, సదరం సర్టిఫికెట్ మంజూరు వంటి అంశాలకు చెందిన మొత్తం-339 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదులను నాణ్యతతో సత్వర పరిష్కారం చేయాలన్నారు. శాఖల వారీగా అర్జీల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్లో నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ విభాగాల అధిపతులు పాల్గొన్నారు. **పెద్దాపురం** స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో ఆర్‌డిఒ శ్రీరమణి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలకు సంబంధించి 6 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో కార్యాలయం ఎఒ మాధవరావు, డిటి భానుకుమార్, సిడిపిఒ జి.ఉష, హౌసింగ్ ఎఇ రవిశంకర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. **సామర్లకోట** వితంతువులకు పింఛన్లు మంజూరు చేయాలని 13వ వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు మున్సిపల్ కార్యాలయంలో జరిగిన పిజిఆర్ఎస్ కార్యక్రమంలో కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఆరునెలలు క్రితం వితంతువుల పేర్లను ఆన్‌లైన్ చేశారని, కానీ నేటికీ వారికి పింఛన్ మంజూరు కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు వితంతువులు పాల్గొన్నారు.

అర్జీదారు సమస్యను వింటున్న ఆర్‌డిఒ శ్రీరమణి

అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి

'నైపుణ్యతను మెరుగు పర్చుకోవాలి'

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు ప్రసాద్ రెడ్డి.

ఫార్మసీ రంగంలో రిజిస్టర్ అయిన ఫార్మసిస్టులు నైపుణ్యతను మెరుగుపరుచుకోవాలని ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సభ్యులు ఎస్ఎల్ఎన్.ప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం కోరంగి ఫార్మసీ కళాశాలలో లైఫ్ సైన్సెస్ సెక్టార్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(ఎల్ఎస్ఎస్‌డిసి) శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఫార్మసిస్టు ఐదేళ్లలో రెండు రకాల కోర్సులలో సర్టిఫికెట్ పొందాలన్నారు. ఫార్మసీరంగంలో ఉన్న పోటీని ఎదుర్కొనడానికి ఆ రంగంలోని విద్యార్థులు సృజనాత్మకతతో విద్యను అభ్యసించాలని అన్నారు. చదువుతోపాటు వివిధ ఆన్‌లైన్ కోర్సులు పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై యాజమాన్యం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. కోరంగి ఫార్మసీ కళాశాలలో జనవరి 6 నుంచి 10వ తేదీ వరకు ఒక కోర్స్, 22 నుంచి 26వ తేదీ వరకు రెండవ కోర్స్‌పై శిక్షణ అందించనున్నట్లు ప్రిన్సిపల్ సువర్ణజ్యోతి తెలిపారు. పిఎం కౌశల్ వికాస్ యోజన పథకంలో భాగంగా స్వల్ప కాలిక నైపుణ్య శిక్షణ, ఫార్మసీ రంగానికి సంబంధించిన ఈ శిక్షణను కోరంగి ఫార్మసీ కళాశాలకు కేటాయించినట్లు కళాశాల కరస్పాండెంట్ పి. కనకరాజు తెలిపారు. ఎల్ఎస్ఎస్‌డిసి సౌత్ జోన్ క్లస్టర్ హెడ్ అమరేంద్రబాబు, ట్రైనర్ హేమలత శిక్షణ ఇచ్చారు. ఎపి స్టేట్ ఫార్మసీ కౌన్సిల్ రిజిస్ట్రార్ ఎం.విలియంకేరి పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎపి స్టేట్ ఫార్మసీ కౌన్సిల్ మెంబర్ జి.దుర్గాప్రసాద్, కళాశాల ఛైర్మన్ దున్న జనార్దన్‌రావు, డైరెక్టర్ చిట్టూరి కలికిమూర్తి, ఎఒ మాల తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి 52 ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - సామర్లకోట

సంక్రాంతి పండుగ రద్దీ కారణంగా సౌత్ సెంట్రల్ రైల్వే 52 అదనపు రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే వెల్లడించింది. సికింద్రాబాద్, కాచిగూడ, చర్లపల్లి రైల్వేస్టేషన్ల నుంచి కాకినాడ, నర్సాపూర్, తిరుపతి, శ్రీకాకుళం ప్రాంతాలకు ఈ రైళ్ల నడపనున్నట్లు తెలిపింది. ఆయా ప్రాంతాలకు ఈ నెల 6 నుంచి 18వ తేదీ వరకు ఇవి అందుబాటులో ఉంటాయని వెల్లడించింది. వికారాబాద్-కాకినాడ టౌన్(07037) రైలు ఈనెల 13వ తేదీన, కాకినాడ టౌన్-చర్లపల్లి (07038) 14వ తేదీన, సికింద్రాబాద్ - కాకినాడ 07078) రైలు ఈనెల 12, 19 తేదీల్లో, చర్లపల్లి - కాకినాడ (07031) రైలు 8, 10, 14, 16, 18 తేదీల్లో, కాకినాడ -చర్లపల్లి (07032) రైలు 9, 11, 13, 15 తేదీల్లో, నాందేడ్-కాకినాడ (07487) రైలు 6,13 తేదీల్లో, కాకినాడ- నాందేడ్ (07488) రైలు 7, 14 తేదీల్లో అందుబాటులో ఉంటున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైళ్లకు సంభందించి టికెట్ బుకింగ్ సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభం అయినట్లు అధికారులు తెలిపారు.

శ్యామలను అభినందించిన కలెక్టర్

ప్రజాశక్తి - కాకినాడ

స్విమ్మర్ శ్యామలను అభినందిస్తున్న కలెక్టర్

విశాఖపట్నం నుంచి కాకినాడ వరకు బంగాళాఖాతంలో వారం పాటు 150 కిలో మీటర్లు ఈది ఘనతను సాధించిన సామర్లకోటకు చెందిన గోలి శ్యామలను కలెక్టర్ షాన్ మోహన్ ఘనంగా సత్కరించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆమె కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వయసుతో నిమిత్తం లేకుండా విశాఖలో మొదలుపెట్టి ఈదుకుంటూ విజయవంతంగా కాకినాడకు చేరుకోవడం గొప్ప విషయమని అన్నారు. సముద్రాలను ఈదడం హాబీగా పెట్టుకున్న ఆమె ధైర్య సాహసాలు నేటి యువతకు స్ఫూర్తిగా నిలుస్తాయని కలెక్టర్ కొనియాడారు.

కార్టూ'నిజం'



గుండె సంరక్షణకు జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి - కాకినాడ



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

గుండె రక్షణ కోసం ముందస్తు జాగ్రత్తలు అవసరమని ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ మాతా శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక మెడికవర్ హాస్పిటల్స్‌లో గుండె సంరక్షణపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలికాలంలో గుండె సంబంధిత సమస్యలు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. వాతావరణం చల్లగా ఉండడం వల్ల రక్తనాళాలు సంకోచిస్తాయన్నారు. దీనివల్ల రక్తప్రవాహం తగ్గిపోవడం, రక్తపోటు పెరగడం వంటి సమస్యలు ఏర్పడుతాయన్నారు. చలికాలంలో గుండె ఆరోగ్యం కాపాడుకోవాలంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరమన్నారు. ప్రత్యేకించి హై బ్లడ్ ప్రెజర్, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు చలి కాలంలో రెగ్యులర్ చెకప్ చేయించుకోవాలన్నారు. ప్రముఖ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రణవ్ పల్లెంపాటి మాట్లాడుతూ చలి కారణంగా శరీర ఉష్ణోగ్రత తగ్గిపోవడం, రక్తనాళాలపై ఒత్తిడి పెరగడం వల్ల గుండె మీద పని భారం ఎక్కువవుతుందన్నారు. ఇది రక్తపోటు పెరుగుదలకు దారి తీస్తుందన్నారు. చలికాలంలో రక్తం కొంచెం గాఢంగా మారుతుందన్నారు. ఇది రక్తనాళాల గడ్డలు ఏర్పడే ప్రమాదాన్ని పెంచుతుందన్నారు. ప్రముఖ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కూరాకుల నరేష్ మాట్లాడుతూ గర్భిణులు, వయోవృద్ధులు, గుండె సంబంధిత సమస్యలు ఉన్నవారు చల్లని వాతావరణం నుంచి తప్పక రక్షించుకోవాలన్నారు. శరీరాన్ని వెచ్చగా ఉంచే బట్టలు ధరించాలన్నారు. తాజా పండ్లు, కూరగాయలు, ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు ఉండే ఆహారం మంచిదన్నారు. శ్వాస సమస్య, ఛాతి నొప్పి, తీవ్రమైన అలసట వంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమములో సెంటర్ హెడ్ శుభాకరరావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ గౌతమ్‌రామ్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగుతున్న గరగల నృత్యాలు

ఘనంగా మరిడమ్మ పుట్టింటి పయనం

ప్రజాశక్తి - పెద్దాపురం

అనాదిగా కొనసాగుతున్న మరిడమ్మ గరగల పుట్టింటి పయనం ఉత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా మరిడమ్మ అమ్మవారు గరగల రూపంలో పుట్టింటికి వెళ్ళటం ప్రతి ఏడాది ఉత్సవంలా నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాన్ని అనువంశిక ధర్మకర్త డాక్టర్ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కె.విజయలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా గరగల నృత్యాలు, డప్పుల దరువులు, బాజా భజంత్రీలతో గరగల ఉత్సవం సామర్లకోటలోని అమ్మవారి పుట్టిల్లు చింతపల్లి వారి ఇంటికి బయలుదేరింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఆసాధులు విజయ్, నాని, వేద పండితులు ప్రసాద శర్మ, వెంకట శాస్త్రి, శంకర శాస్త్రి, ఆలయ సిబ్బంది శివ, లోవ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

17న దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల పింఛన్ల పరిశీలన

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రభుత్వ ఆదేశాల మేరకు దీర్ఘకాలిక వ్యాధుల పింఛన్లను ఈ నెల 17న పరిశీలిస్తామని మున్సిపల్ కమిషనర్ కెవి.పద్మావతి తెలిపారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలో ఇద్దరు మాత్రమే దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు పింఛన్లు పొందుతున్నారని అన్నారు. ఒకరు పక్షవాతంతో, ప్రమాదానికి గురియైన మరో వ్యక్తి పింఛన్ తీసుకుంటున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు నియమించిన డాక్టర్ పర్యవేక్షణలో ఈ పింఛన్లను పరిశీలిస్తారని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - తాళ్లరేవు

విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ మార్పు చేయనున్న దృష్ట్యా మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఇఇ ఉదయభాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తాళ్లరేవు, సీతారామపురం, పి.మల్లవరం, పోలేకుర్రు, కోరంగి, గాడిమొగ, భైరవపాలెం, చినవలసల, పెదవలసల, జార్జిపేట, నీలపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి సహకరించాలని కోరారు.

నేడు సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - కరప

మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నటు ఎంపిడిఒ ఎం. అనుపమ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఎంపిటిసిలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రభుత్వ శాఖలకు చెందిన మండల అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

కాకినాడ జిల్లా సంక్షిప్త వార్తలు

నేరాలు ఘోరాలు

చెరువులో పడి కూలీ మృతి

ప్రజాశక్తి - కరప

మండలంలోని సిరిపురం గ్రామంలో చిక్కాల దొరబాబుకు చెందిన రొయ్యల చెరువులో పడి ఒక కూలీ మృతి చెందాడు. ఎస్ఐ టి.సునీత తెలిపిన వివరాల ప్రకారం...జి.భావరం గ్రామానికి చెందిన అయితా గోవిందు ఆనందబాబు (59) రొయ్యల చెరువు దగ్గర కూలీగా పని చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం రొయ్యలకు మేత వేస్తుండగా ఫైబర్ బోటు ప్రమాదవశాత్తు తిరగబడి మునిగిపోయింది. దీంతో ఆనందబాబు చెరువులో పడి మునిగిపోయాడు. దీంతో రొయ్యల మేత వేస్తున్న తోటి కూలీలు బోడపాటి దుర్గా ప్రసాద్, ఊటా బుల్లిరాజు చెరువులో దిగి ఆనందబాబును బయటికి తీసే సరికి చనిపోయి ఉన్నాడని, మృతుని పెద్దకొడుకు అయిన సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం-వాలుతిమ్మాపురం రహదారిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సామర్లకోట గవరపేట నగరానికి చెందిన పెంకే అప్పారావు (60) పట్టాభి ఆగ్రో రైస్ మిల్లులో పని చేస్తున్నాడు. సోమవారం పని ముగించుకుని బైక్‌పై సామర్లకోట వెళ్తుండగా వాలు తిమ్మాపురం వైపు వెళుతున్న లారీ బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న అప్పారావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ మౌనిక సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని వాలుతిమ్మాపురం క్వారీ ఏరియాలో సోమవారం నిర్వహించిన దాడుల్లో సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సిఐ అర్జునరావు తెలిపారు. ఈ దాడుల సందర్భంగా ఒకరిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు చిట్టిబాబు, ఆనందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుని మృతి

ప్రజాశక్తి - పెరవలి

మండలంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఖండవల్లికి చెందిన పెదపూడి శక్తిగణేష్‌కుమార్(25) తన స్నేహితుడు వినయ్‌కుమార్‌తో కలిసి బైకుపై తణుకు నుంచి ఖండవల్లి వైపు జాతీయ రహదారిపై వెళ్తున్నారు. వారు రవళి స్పినింగ్ మిల్ సమీపానికి చేరుకునే సరికి ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి రోడ్డు ప్రక్కన ఉన్న సైన్ బోర్డును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో గణేష్ కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన వినయ కుమార్‌ను తణుకులో ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు.

కోడిపందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

మండలంలోని ర్యాలి గ్రామం శివారున కోడిపందేలు జరుగుతున్నాయన్న విశ్వసనీయ సమాచారం రావడంతో సోమవారం సాయంత్రం ఎస్సై ఎస్ రాము, సిబ్బంది కలిసి కోడి పందేల శిబిరంపై దాడి చేశారు. ఈ దాడులలో ఆరుగురు వ్యక్తులను అదుపులో తీసుకుని వారి వద్ద నుండి రెండు కోళ్లు, రెండు కత్తులు, రూ.3 వేలు నగదు స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

కదిలిన 'స్టెల్లా ఎల్' నౌక

బయలుదేరిన స్టెల్లా ఎల్ నౌక

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఆకస్మిక తనిఖీల్లో భాగంగా పేదలకు అందజేస్తున్న పిడిఎస్ బియ్యం తరలిపోతున్నట్లు గుర్తించి అధికారులు నిలిపివేసిన 'స్టెల్లా ఎల్' నౌక ఎట్టకేలకు కాకినాడ తీరం నుంచి కదిలింది. పశ్చిమ ఆఫ్రికా తీరంలోని బెనిన్ దేశ వాణిజ్య కేంద్రం కొటోనో పోర్టుకి షిప్ బయలుదేరేందుకు అనుమతి ఇస్తున్నట్లు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి విలేకరులకు తెలిపారు. 55 రోజులుగా నిలిచిపోయిన షిప్ సోమవారం తెల్లవారుజామున బయలు దేరి వెళ్లినట్లు పోర్ట్ అధికారులు వెల్లడించారు.

గతేడాది నవంబర్ 11న హల్దియా దేశం నుంచి ఈ నౌక కాకినాడ తీరానికి వచ్చింది.వివిధ కంపెనీలకు చెందిన 52 వేల మెట్రిక్ టన్నుల బియ్యానికి 32,415 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎగుమతి కోసం అందులోకి లోడ్ చేశారు. అయితే పిడిఎస్ బియ్యం నూకలు ఉన్నట్లు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో నవంబర్ 27న కాకినాడ కలెక్టర్ సన్మోహన్ సగిలి ఆకస్మికంగా తనిఖీలు చేసి నౌకను నిలిపివేయించారు. ఆ తర్వాత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కాకినాడ పర్యటనకు వచ్చి రేషన్ మాఫియాపై నిప్పులు చెరిగారు. ఆయన ఆదేశాలతో డిసెంబర్ 4న షిప్‌లో పూర్తిస్థాయిలో తనిఖీలు చేయగా లోడింగ్ చేసిన బియ్యంలో 1,320 టన్నులు పిడిఎస్ బియ్యంగా గుర్తించారు. కాకినాడకు చెందిన సత్యం బాలాజీ రైస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందినదిగా గుర్తించిన సివిల్ సప్లయిస్ అధికారులు 6ఎ కేసు నమోదు చేసి పోర్టు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అందులో ఉన్న 1,320 టన్నుల పేదల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని గొడౌన్‌కు తరలించి సీజ్ చేశారు. కొన్ని కంపెనీల అభ్యర్థనతో మిగిలిన బియ్యాన్ని షిప్పులోకి లోడింగ్‌కు ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. ఈ నేపథ్యంలో షిప్‌ను సముద్రంలో నిలుపుదలకు చెల్లించాల్సిన యాంకరేజ్ చార్జీ, కార్గో నౌకలోకి లోడింగ్ చేసేందుకు కట్టాల్సిన ఎక్స్‌పోర్ట్ డ్యూటీ ఫీజు పోర్టు అధికారులకు స్టెల్లా షిప్ స్టీమర్ ఏజెంట్ చెల్లించి నోడ్యూస్ సర్టిఫికెట్ పొందారు. దీంతో కస్టమ్స్ అధికారులు సైతం క్లియరెన్స్ ఇవ్వడంతో వివరకు షిప్ కదిలింది.

ఫిర్యాది బంధువులపై సిఐ దాడి

-రోడ్డుపై బైఠాయించిన బాధితులు

సర్పవరం స్టేషన్ ఎదురుగా రోడ్డుపై ధర్నా చేస్తున్న బాధితులు

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ఏదైనా ఫిర్యాదు చేసేందుకు స్టేషన్ వచ్చిన బాధితులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని పోలీసు ఉన్నతాధికారులు పదే పదే చెబుతారు. కానీ ఆచరణలో అందుకు విరుద్ధంగా పోలీసు శాఖలోని కొందరు వ్యవహరిస్తున్నారు. ఇందుకు ఉదాహరణే కాకినాడ రూరల్ సర్పవరం పోలీసు స్టేషన్‌లో సోమవారం చోటుచేసుకుంది. ఫిర్యాదు చేసిన బాధితురాలి బంధువులపై సిఐ లాఠీతో దాడి చేయడంతో బాధితులు రోడ్డుపై బైఠాయించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాలు ఇలావున్నాయి..

స్థానిక దుర్గా నగర్‌లో జలసూత్రపు కృష్ణ కుమార్తె, అల్లుడు నివాసం ఉంటున్నారు. అదే ఇంటిలో పక్క పోర్షన్‌లో అద్దెకు ఉంటున్న ఎపిఎస్‌పి కానిస్టేబుల్ చనుబోయిన లోవరాజు గత సంవత్సరకాలంగా ఆ వివాహితను లైంగిక వేధింపులకు పాల్పడుతున్నాడు. ఈ విషయంపై గతంలో కూడా రెండు కుటుంబాల మధ్య గొడవలు కూడా జరిగాయి. అయినప్పటికీ కానిస్టేబుల్ ఎంత డబ్బు కావలిస్తే అంత డబ్బులు ఇస్తాను తన కోరిక తీర్చాలని పదే పదే వెంటపడుతూ అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడు. దీంతో కానిస్టేబుల్ వేధింపులు భరించలేక 5 రోజుల క్రితం బాధితురాలితో సర్పవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఆ ఫిర్యాదుపై సంబంధిత కానిస్టేబుల్‌ను స్టేషన్‌కు పిలిపించారు. అనంతరం మరుసటి రోజు ఉదయం 10 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు క్షమాపణ చెప్పిస్తామని, రాజీ పడాలని, బాధితురాలి సాక్ష్యం చెల్లదని పోలీసులు ఒత్తిడి చేశారు. అయితే వారు రాజీకి ఒప్పుకోలేదు. రాత్రి పది గంటల సమయంలో పెద్దలను తీసుకుని రావాలని చెప్పి పంపించారు. తర్వాత రోజు నుంచి బాధితులు పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్న కేసు నమోదు చేయకుండా కాలయాపన చేస్తూనే ఉన్నారు. అప్పటి నుంచి సర్పవరం సిఐని కలిసేందుకు అవకాశం కల్పించలేదు. ఇదే విషయంపై సోమవారం ఎస్‌పి కార్యాలయంలో గ్రీవెన్స్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే బాధితులు సర్పవరం పోలీస్ స్టేషన్‌కి సోమవారం వెళ్లారు. ఎంతకూ తమను పట్టించుకోకపోవడంతో తమకు న్యాయం చేయాలని, లేకుంటే రోడ్డుపై ధర్నాకు దిగుతామని వారు స్పష్టం చేశారు. దీంతో సిఐ దురుసుగా వచ్చి లాఠీతో బాధితులపై దాడి చేశారు. దీంతో బాధితిరాలితోపాటు, ఆమె కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న రోడ్డుపై బైఠాయించారు. తమకు న్యాయం చేయాలని అడిగినందుకు తమపై లాటితో దాడి చేసి కొట్టడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా తమ కుమార్తెను లైంగికంగా వేధించిన కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాధితుల ఆందోళనతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కల్గింది.

రీ సర్వేపై అవగాహనా ర్యాలీలు

సామర్లకోటలో అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, రైతులు

ప్రజాశక్తి - యంత్రాంగం

సామర్లకోట మండలంలోని వేట్లపాలెం గ్రామంలో రీ సర్వేపై అవగాహన ర్యాలీని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ భావన పాల్గొని మాట్లాడారు. రీ సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, రీ సర్వే డిటి శ్రీనివాస్, సర్వేయర్ సీతారామాచార్యులు, సర్పంచ్ చిల్లి వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ గోలి శ్రీరామ్, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. **తాళ్లరేవు** మండలంలోని పటవల గ్రామంలో రీ సర్వేపై నిర్వహించిన అవగాహన ర్యాలీని ఎంపిపి రాయుడు సునీత ప్రారంభించారు. గతంలో రీ సర్వే జరగని కోరంగి, పి.మల్లవరం, పోలేకుర్రు, పటవల గ్రామాలలో రీ సర్వే చేపడుతున్నట్లు తహశీల్దార్ పితాని త్రినాధరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాయుడు గంగాధర్, డిసి వైస్ ఛైర్మన్ కొత్తూరి కాశీఈశ్వరుడు, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, డిటి సూరిబాబు, రీ సర్వే డిటి. వీరబాబు, ఆర్ఐ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు. **పెద్దాపురం** ఈ నెల 20న మండలంలోని కట్టమూరులో జరిగే రీ సర్వే గ్రామసభపై సోమవారం ప్రజా చైతన్య ప్రత్యేక అవగాహనా ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి మాట్లాడుతూ గతంలో రీ సర్వే నిర్వహించిన గ్రామాల మినహా మిగిలిన వాటిలో ప్రస్తుతం రీ సర్వే గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. రీ సర్వేలో రైతులందరూ తమ భూములకు సంబంధించిన వివరాలతో అందుబాటులో ఉండాలన్నారు. ఈ ర్యాలీలో సర్పంచ్ దిమ్మల పుష్పరత్నం, విఆర్‌ఒలు నందూరి. వెంకటప్రసాదరావు, ఎవివి.లక్ష్మి రైతులు పాల్గొన్నారు. **కాజులూరు** మండలంలోని కోలంక గ్రామంలో సర్వేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎల్.శివకుమార్ పాల్గొని మాట్లాడారు. సర్వే చేసే సమయంలో ప్రతి రైతు పూర్తిస్థాయిలో అవగాహన చేసుకుని ఏదైనా సమస్య ఉంటే సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కోటిపల్లి డిసి దాట్ల విజయ గోపాలరాజు, నీటి సంఘం మాజీ అధ్యక్షులు దాట్ల బుచ్చిబాబురాజు, మండల సర్వేయర్ సూర్య నారాయణమూర్తి, ఆర్ఐ, విఆర్ఓ, గ్రామ సర్వేయర్, రైతులు పాల్గొన్నారు.

యానాం వార్తలు

జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి రంగస్వామి

ప్రజా ఉత్సవాలను ప్రారంభించిన సిఎం

- ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఫల పుష్ప ప్రదర్శన

ప్రజాశక్తి - యానాం

స్థానిక జిఎంసి బాలయోగి క్రీడా ప్రాంగణంలో 21వ యానాం ప్రజా ఉత్సవాలతో పాటు 23వ ఫల పుష్ప ప్రదర్శన వేడుక సోమవారం ఘనంగా ప్రారంభమైంది. స్థానిక ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అధ్యక్షతన, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆధ్వర్యంలో ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలను పుదుచ్చేరి సిఎం రంగస్వామి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజలను చైతన్యం చేయడమే లక్ష్యంగా యానాం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు ఈ ప్రదర్శన అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ప్రజలకు వినోదాన్ని కలిగించేందుకు ప్రతి ఏటా ప్రజా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. వందలాది రకాల పుష్ప జాతుల మొక్కలను వివిధ రకాల పండ్ల మొక్కలను ప్రదర్శనలు ఉంచారు. వ్యవసాయ శాఖ నర్సరీలో పెంచిన మొక్కలతో పాటు బెంగుళూరు, పూనే, కడియం నర్సరీల నుంచి తీసుకువచ్చిన పూల మొక్కలు ప్రదర్శనలో పుష్ప ప్రేమికులను ఆకర్షించేలా అందంగా తీర్చిదిద్దరు. ఈ ప్రదర్శనను తిలకించేందుకు యానాం పరిసర ప్రాంతాల నుంచి వేలాదిమంది సందర్శకులు భారీ ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రంగస్వామి చేతుల మీదుగా వెంకటేశ్వర స్వామి ఆలయ పున్ణనిర్మాణ 3డి వీడియోను ఆవిష్కరించారు. అనంతరం వినోద కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పుదుచ్చేరి స్పీకర్ సెల్వం, పర్యాటక శాఖ మంత్రి కె.లక్ష్మీనారాయణ, వ్యవసాయ శాఖ మంత్రి జైకుమార్, ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శివ సుబ్రహ్మణ్యన్, పుదుచ్చేరి ఎంఎల్ఎలు, తదితరులు పాల్గొన్నారు.

వివరాలు అడుగుతున్న డిడి అర్ముగం

వికలాంగుల పాఠశాలన సందర్శన

ప్రజాశక్తి - యానాం

స్థానిక ఉమా ఎడ్యుకేషనల్ అండ్ టెక్నికల్ సొసైటి మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాలను పుదుచ్చేరి స్త్రీ శిశు సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆర్ముగం సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలు చేస్తున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలకు హాజరు కాలేని పిల్లలకు స్వయంగా ఇంటికి వెళ్లి బోధిస్తున్నట్లు తెలిపారు. విద్యను అందిస్తున్న విధానాన్ని చూసి ఆయన ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ కరుణానిధి, చింతా రామజోగి, ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ కో డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి, ప్రిన్సిపల్ ఎస్ఐ.నాయుడు, ఇన్‌ఛార్జ్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

జీడిపిక్కల ఫ్యాక్టరీ కార్మికుల ధర్నా

ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

మండలంలోని చిన్నింపేట జీడిపిక్కల కార్మికులు సోమవారం ఫ్యాక్టరీ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు రొంగల ఈశ్వరరావు మాట్లాడుతూ కాకినాడ కార్మిక శాఖ సోమవారం జరిగిన చర్చలు అర్ధాంతరంగా ముగిశాయని అన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం కార్మిక సమస్యలు పరిష్కరించలేమని పాత పాటే పాడిందన్నారు. ఫ్యాక్టరీని తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. గత 52 రోజులుగా ఉపాధిని కోల్పోయిన కార్మికులు ఆర్థికంగా అనేక ఇబ్బందులు పడుతున్నందున అధికారులు యాజమాన్యాన్ని వెంటనే చర్చలకు పిలిచి ఫ్యాక్టరీ తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అనిశెట్టి వీరబాబు, చక్రధర్, గోవిందు, ధర్మాజీ, బి.ఆది, ఎం.కాంతారావు రామదుర్గ, జయలక్ష్మి, అన్నపూర్ణ, శివలక్ష్మి, పాపారత్నం, చంటి, వరలక్ష్మి పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తేనే ఆటోలకు అనుమతి

ప్రజాశక్తి - శంఖవరం

నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిస్తేనే అన్నవరం దేవస్థానం కొండపైకి ఆటోలను అనుమతి ఇస్తామని దేవస్థానం అధికారులు వెల్లడించారు. సోమవారం దేవస్థానం అధికారులు, పోలీసులు, ఆటో యూనియన్ సభ్యులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు నియమ నిబంధనలను ప్రకటించారు. ప్రతి ఆటో డ్రైవర్ తిలకధారణ చేయాలని, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, యూనిఫామ్ ధరించాలని, ఆటోలపై అన్యమతాలకు సంబంధించిన ఫోటోలు, వ్యాఖ్యలు ఉండరాదని, ఆటోపై డ్రైవర్ పేరు, ఫోన్ నెంబర్ యాత్రికులకు కనబడే విధంగా ఉండాలని, సీరియల్ నెంబర్ ఉండాలని, ఆటోలకు ఉదయం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు మాత్రమే ఘాట్ రోడ్డుకు అనుమతి ఇస్తామని, ఆటోలో ముగ్గురుని మాత్రమే తీసుకుని వెళ్లాలని అన్నారు. ఆయా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కొండపైకి ఆటోలు అనుమతి ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్ఐ హరిబాబు, దేవస్థానం సెక్యూరిటీ అధికారి ఆకుల ప్రసాద్, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

దాడుల సంస్కృతి సరికాదు

గాయపడిన ఎంపిటిసితో మాట్లాడుతున్న గిరిబాబు

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

రాజకీయ కక్షలతో టిడిపి శ్రేణులు దాడులకు పాల్పడటం సరికాదని వైసిపి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. సోమవారం శరభవరం గ్రామంలో టిడిపి శ్రేణుల దాడిలో గాయపడిన ఎంపిటిసి సభ్యులు అమరాధి కాశీని ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆయన పరామర్శించారు. దాడికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీ దాడులు చేయడం సరి కాదని, కాశీకి వైసిపి అండగా ఉంటుందన్నారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బదిరెడ్డి గోవింద్, బంకు శ్రీను, గొల్లపల్లి కాశీ విశ్వనాథ్, జల్లిగంపల ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు. అలాగే వైసిపి నాయకుడు ముదునూరి మురళీ కృష్ణంరాజు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎంపిటిసి కాశీని పరామర్శించారు. వైసిపి శ్రేణులపై దాడులు మానుకోవాలని, కాశీకి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోజడ్‌పిటిసి బెహరా రాజేశ్వరి, బంకు శ్రీను, రామిశెట్టి బుల్లిరామకృష్ణ, జువ్వల దొరబాబు పాల్గొన్నారు.

దొరబాబు కుటుంబానికి ఎంఎల్ఎ పరామర్శ

బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

కేటరింగ్ నిర్వాహకుడు పోలిశెట్టి దొరబాబు కుటుంబాన్ని ఎంఎల్ఎ వరుపుల సత్యప్రభ పరామర్శించారు. దొరబాబు తండ్రి బాలయ్య ఇటీవల మృతి చెందాడు. ఈ సమాచారాన్ని తెలుసుకున్న ఎంఎల్ఎ సత్యప్రభ సోమవారం దొరబాబు స్వగృహానికి చేరుకుని పరామర్శించారు. మృతుడు బాలయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. దొరబాబుకు ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొమ్ముల కన్నబాబు, యాళ్ల జగదీష్, తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని మాజీ మంత్రి, వైసిపి నాయకులు ముద్రగడ పద్మనాభం, వైసిపి నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు డిమాండ్ చేశారు. సోమవారం ముద్రగడ నివాసానికి జె.అన్నవరం, గజ్జనపూడి గ్రామాలకు చెందిన వైసిపి కార్యకర్తలు వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపిని నియోజకవర్గంలో పటిష్టం చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బదిరెడ్డి గోవింద్, గొల్లపల్లి కాశీవిశ్వనాథ్, గువేరా పాల్గొన్నారు.

తిమ్మాపురంలో రైతు సదస్సు

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని జె.తిమ్మాపురం గ్రామంలో రైతు సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు 'వ్యవసాయ అవగాహన-పని అనుభవం'పై నమూనాలు, చిత్రపటాలు ప్రదర్శించారు. ఈ సదస్సులో ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ డైరెక్టర్ డాక్టర్ పి.మునిరత్నం, రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ డి.శ్రీనివాసరావు పాల్గొని పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎడిఎ ఎన్.దైవకుమార్, ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ శర్మ, హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ డాక్టర్ దక్షిణామూర్తి, ఎంపిటిసి సభ్యులు బత్తిన రమణమ్మ, వివిధ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా సంక్రాంతిని జరుపుకోవాలి

ప్రజాశక్తి - గొల్లప్రోలు, పెద్దాపురం

సాంప్రదాయబద్ధంగా సంక్రాంతి పండుగను జరుపుకోవాలని సిఐ జి.శ్రీనివాస్ అన్నారు. మండలంలోని చెందుర్తి గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో యువతకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడిపందాలు, పేకాట, గుండాట వంటి జూద క్రీడలు ఆడవద్దని, సాంప్రదాయ పద్ధతిలో సంక్రాంతి పండుగ జరుపుకోవాలని సూచించారు. వాలీబాల్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఎన్.రామకృష్ణ, పోలీస్ సిబ్బంది, యువత పాల్గొన్నారు. అలాగే పెద్దాపురం మండల పరిధిలో సంక్రాంతి పండుకను జూదాలకు తావు లేకుండా నిర్వహించుకోవాలని ఎస్ఐ వి.మౌనిక సూచించారు. కాండ్రకోట గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోడిపందాలు, జూదాల వల్ల జరిగే అనర్థాలపై ఆమె అవగాహన కల్పించారు. సంక్రాంతి పర్వదినాలను కుటుంబ సమేతంగా ఆనందంగా గడపాలన్నారు. కోడిపందాలు, జూదాలు, గుండాట వంటివి చట్ట వ్యతిరేఖమన్నారు.

తాగునీటి అవసరాలకు ప్రణాళికలు రూపకల్పన

ప్రజాశక్తి - తాళ్లరేవు

ప్రజల తాగునీటి అవసరాలను గుర్తించి ప్రణాళికలు రూపొందించడానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా పర్యటనలు చేస్తున్నట్లు జడ్‌పి సిఇఒ వివివిఎస్.లక్ష్మణరావు అన్నారు. సోమవారం తాళ్లరేవు, పటవలలోని సాగునీటి ప్రాజెక్టులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఇ.సుకీర్తి తాళ్ళరేవు ప్రాజెక్టులో 63 కెవి ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ సరిపోవడంలేదని, 100 కెవి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలనికోరారు. ఫిల్టర్ బెడ్ నుంచి బ్యాక్ వాటర్ విడుదల చేయడానికి డ్రెయినేజీ నిర్మాణానికి రూ. 23 లక్షలు విడుదల చేయాలని కోరారు. అనంతరం మండల పరిషత్‌లో 2015 నుంచి 2022 వరకు ఉన్న రికార్డులను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో ఎంపిడిఒ సత్యనారాయణ, సచివాలయ కార్యదర్శి వేణుగోపాల్, కూటమి నాయకులు మందాల గంగ సూర్యనారాయణ, నడింపల్లి వినోద్, వాసంశెట్టి శ్రీనివాస్, గంజా సూరిబాబు, మేడిశెట్టి సత్యనారాయణ, చిట్టూరి చలపతి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కరప విద్యార్థులు

ప్రజాశక్తి - కరప

స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కుడో మిక్సిడ్ మార్షల్ ఆర్ట్స్ క్రీడా పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం పాఠశాల వద్ద ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 5న హసన్‌బాద జడ్‌పి ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని అన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన పి.వీరప్రవీణకుమార్, డి.ఈశ్వర్‌దుర్గాప్రసాద్, జి.దుర్గాదిలీప్, పి.రవికిరణ్, ఎ.రోహిన్, ఎన్.యశ్వంత్‌కృష్ణచైతన్య, టి.దుర్గాప్రసాద్, డి.డేవిడ్, వి.అభిరామ్‌లను ఎస్ఎంసి ఛైర్మన్ దేవు దుర్గారావు, పాఠశాల పీడీ కె.శ్రీనివాసరావు, స్టాఫ్ సెక్రటరీ మారిశెట్టి రమేష్, తదితరులు అభినందించారు.

ధాత్రి ట్రస్ట్ సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి - పెదపూడి

చిన్న వయసులోనే జన హృదయాల్లో సుస్థిర స్థానాన్ని పొందని సబ్బెళ్ళ సురేష్ రెడ్డి భౌతికంగా మన మధ్య లేకపోయినా ధాత్రి ట్రస్ట్ ద్వారా తన స్నేహితులు అందిస్తున్న సేవా కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ వుండ్రు సత్యనారాయణ అన్నారు. సోమవారం మండలంలోని కరకుదురు హైస్కూల్ 10వ తరగతి విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్‌ను అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ధాత్రి ట్రస్ట్ ప్రత్యేక ఆహ్వానితులు నల్లమిల్లి వెంకటరెడ్డి, ట్రస్ట్ కార్యదర్శి చింతాప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి - సామర్లకోట

మండలంలోని పనసపాడు గ్రామానికి చెందిన బత్తుల లోహితేశ్వర్‌కు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప అందజేశారు. సోమవారం అచ్చంపేటలోని ఆయన స్వగృహంలో బాధితునికి రూ.1,80,199 చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో పనసపాడు గ్రామం సర్పంచ్ చీకట్ల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

సిబ్బందితో మాట్లాడుతున్న జెసి

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా ఆదేశించారు. పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న రెవెన్యూ, పిహెచ్‌సి, వాటర్ పంప్ హౌస్, ఇతర పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం తాడిపత్తిలోని వాటర్ పంప్ హౌస్‌కు సంబంధించి బోరులను పరిశీలించారు. ఈ పర్యటనలో తహశీల్దార్ కెవివి.సత్యనారాయణ, ఎంపిడిఒ కె.స్వప్న, మున్సిపల్ కమిషనర్ ఎన్.కనకారావు, తదితరులు పాల్గొన్నారు.

KANAKADURGA FINANCE LIMITED

(RBI ద్వారా గుర్తింపు పొందినది)

బ్రాంచిఆఫీస్: 2-1-81, ఫస్ట్‌ఫ్లోర్, హనుమాన్ కాంప్లెక్స్, కెఎన్‌ఎఫ్ మెయిన్‌రోడ్డు, ఖజానా జ్యూయలరీ ప్రక్కన, అమలాపురం.
- ఫస్ట్‌ఫ్లోర్, పద్మజ థియేటర్ రోడ్డు, మల్కిపురం
- ఫస్ట్‌ఫ్లోర్, ద్వారకా కాంప్లెక్స్, బస్టాప్ ఎదురు, విక్టరీ గార్డెన్ ప్రక్కన, రావులపాలెం. - D.no:6-7-21/8, first floor, Sai Complex, Opp.Viveka Junior College, Balaji Road,Tuni

బంగారు వేలం ప్రకటన

ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 26-01-2025 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 808.65 గ్రాముల వస్తువులు కుదువపెట్టిన పాత బంగారం నగలు #238-4-11, Subbammadevi High School Road, Opp.Zed Labs, R.R.Peta, Eluru. నందు వేలం వేయబడును. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించుకోకుండా వదిలిపెట్టిన తీసుకున్న అప్పులు చెల్లించని వారందరికీ మా వేలం నోటీసులు రిజిస్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంట తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.

ఆథరైజ్డ్ ఆఫీస్

KANAKADURGA FINANCE LIMITED
#238-4-11,Subbammadevi High School Road, Opp.Zed Labs,R.R.Peta, Eluru-534 002.
Contact person, area manager, p.hemanth kumar 8074656196

పాస్‌పోర్టు పోయినది

నా పేరు బూర కుమారి, భర్త: బాబులు అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు అథారిటీ వారిచే 2022లో జారీ చేయబడిన పాస్‌పోర్టు నెం. **W2912473** నా గృహం అనగా ఏలేశ్వరం మండలం, పెద్దనాపల్లి గ్రామం నుండి మోటార్ సైకిల్‌పై జిరాక్స్ నిమిత్తం ఏలేశ్వరం వెళుతుండగా ది. 12-12-2024వ తేదీన పాస్‌పోర్టు ఎక్కడో పోయినది. చుట్టుప్రక్కల ఎంత వెతికినా దొరకలేదు. దొరికినవారు ఈక్రింది చిరునామాలో తెలియజేయగలరు.

బూర కుమారి
భర్త: బాబులు, డోర్ నెం. 4-90,
పెద్దనాపల్లి గ్రామం, ఏలేశ్వరం మండలం
కాకినాడ జిల్లా, సెల్: 99591 06309

PUBLICATION

IN THE COURT OF THE HON'BLE II ADDL DIST COURT : Dr. B. R. AMBEDKAR KONASEEMA DIST: AMALAPURAM
ARBEP No.773 of 2022 In AC No: 1067 of 2021

Between:
Shriram Tranceport Finance Co., Ltd, Amalapuram Branch, rep by its GPA holder B.Srinivas Reddy ...D.Hr.
Vs
Kanithi Durga Vara Prasad & another
2nd JDr: Chappidi Naga Manikanta, S/o. Ramana Yesu, D.No.2-4-8, Amalapuram.

The above named D Hr company has instituted the above ARBEP against you, and the same stands posted to 14-02-2025 at 10.30 A.M. for your appearance, you are hereby required to appear personally or through advocate attend before this Hon'ble court at 10.30 AM and file your objections if any, failing which the matter will be heard and determined in your absence experte as per Law.

//by the orders of the Hon'ble court//

V.K.S.Bhaskara Sastri,
Amalapuram Advocate, Amalapuram
Dt.20-12-2024 Cell: 98483 44577

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు రాజమండ్రి
EP No.19/2018
in
OS No. 132/2004

Between :
ముద్దే నాగేశ్వరరావు - DHR
మరియు
అల్లాడ శ్రీరామమూర్తి (లేటు) మరియు ఇతరులు - JDR's

నోటీసు

To
JDR4) Allada Leela Prasad, S/o. Late Srirama Murthy, Hindu, Aged 50 years, Advocate, D.No.57-3-8, Mallikarjuna Nagar, Near Ambedkar Statue, Annayyachari Street, Rajahmundry
JDR5) Kondupalli Varalakshmi, W/o. Mallikarjuna Rao, Hindu, Aged 57years, House wife, D.No.28-11-26, Devichowk, Rajahmundry

పై నెంబరు గల పిటీషన్‌లో శ్రీ కోర్టువారు మీకు Rule 54 నోటీసు వేసియున్నారు. కాని మీరు నోటీసు తీసుకొనక కాలయాపన చేస్తున్నందున శ్రీ కోర్టువారు ఈ పేపరు ప్రకటన ద్వారా మీరు Rule 54 నోటీసు ఆర్డరు వేసియున్నారు. సదరు పిటీషన్ వాయిదా ది.20-01-2025వ తేదీకి వాయిదా అయివున్నది. కావున మీరు ఈ వాయిదా తేదీ ఉదయం 10.30 గంటలకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గానీ హాజరై తమ ఆక్షేపణలను తెలుపుకోవలెను. లేని యెడల సదరు పిటీషన్‌ను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీకోర్టు వారి ఆర్డరు మేరకు)

BARLA SRIKANTH
Advocate
D.No.77-9-33/8, Katari Gardens, Rajamahendravaram-533103.